జయ జయహే మహిషాసురమర్దిని

- వైభవంగా దసరా ఉత్సవాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న చందన నాగేశ్వర్


ఎర్రకొండ నేతాజీ నగర్‌లోని విజయదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి


బీఆర్‌కే రాయల్ సిటీలో దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు


మహిషాసురమర్దినిగా కాశీ అన్నపూర్ణాదేవి


శివకామేశ్వరీ పీఠంలో నవదుర్గలు

సీటీఆర్ఐ: దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. దేవీచౌక్‌లోని అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. విజయవాడలో దుర్గమ్మ దర్శనానికి బయలుదేరుతున్న భవానీ మాలాధారులు ముందుగా దేవీచౌక్ లో అమ్మవారిని దర్శించుకున్నారు.

- ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాతను మహిషాసురమర్దినిగా అలంకరించారు.
- వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో తమలపాకులతో అలంకరణ చేశారు.
- బలరామపేటలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో కాశీఅన్నపూర్ణాదేవిని మహిషాసురమర్దినిగా అలంకరించారు.
- జేఎన్ రోడ్డులోని జీవీకే హాస్పిటల్ ఎదురుగా షిరిడీ సాయి మార్గ్ వీధిలోని శివకామేశ్వరీ పీఠంలో ఈమని దక్షిణామూర్తి సిద్ధాంతి ఆధ్వర్యంలో జరుగుతున్న 33వ శరన్నవరాత్ర మహోత్సవాలు ముగింపు దశకు చేరాయి. దీనిలో భాగంగా శుక్రవారం నవదుర్గలను అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం మహిషాసురమర్దినిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

- బాలాజీ పేటలోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, వాసంశెట్టి సూర్య గణేష్, తలారి శ్రీనివాసరావు, సూరంపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక తూర్పు రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బీఆర్‌కే రాయల్ సిటీలో శరన్నవరాత్ర వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజూ కుంకుమ పూజలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి వివిధ దేవతా మూర్తుల వేషధారణతో చిన్నారులు కనువిందు చేశారు. బీఆర్‌కే రాయల్ సిటీలోని మహిళలందరూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కడియం: శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. కడియంతో పాటు కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరాలయం, దుళ్లలోని శారదాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి పక్కనే కడియపులంకలో కొలువైన పల్లాలమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చందన నాగేశ్వర్ పూజలు

సీటీఆర్ఐ: క్వారీ మార్కెట్‌లోని సారంగధరమెట్లపై గల కాళేశ్వర సహిత బాలా త్రిపుర సుందరి, కాళీ కాంబ భద్రకాళీ దేవస్థానంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారిని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు వీర బ్రహ్మానంద స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, రాజమహేంద్రవరం రూరల్ జేసీఎస్ ఇన్‌చార్జి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రారంభోత్సవం

ధవళేశ్వరం: ఎర్రకొండ నేతాజీ నగర్‌లోని విజయ దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సావాడ శ్రీనివాసరెడ్డి సుమారు రూ.లక్షతో ఆలయాన్ని పునఃనిర్మించిన ఈ ఆలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నేతాజీ నగర్ ప్రాంతంలో పర్యటించారు. మార్ని వాసు, వాసిరెడ్డి రాంబాబు, మత్స్యేటి ప్రసాద్ పాల్గొన్నారు.


మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారు


కడియపులంకలో పల్లాలమ్మ


మహిషాసురమర్దినిగా దేవీచౌక్ రాజరాజేశ్వరి అమ్మవారు

ఆలోచనా విధానంలో మార్పు రావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సజయ్

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం చెడు వార్తలతో, సంఘటనలతో నిండుతున్న ప్రస్తుత రోజుల్లో పిల్లలు, పెద్దలు, కుటుంబాలు పాజిటివ్‌గా ఆలోచించాలని యెహోవా సాక్షుల స్థానిక ప్రతినిధి జి.సజయ్ అన్నారు. 'మంచి వార్త ప్రకటించండి' పేరుతో 2024 యెహోవా సాక్షుల ప్రాదేశిక సమావేశం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, అమలాపురం పరిసర ప్రాంతాల నుంచి సుమారు 2,500 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా సజయ్ మాట్లాడుతూ కుటుంబాలు పాజిటివ్‌గా ఎలా ఆలోచించాలో సమావేశంలో వివరించారు. దేశంలోని 48 కన్వెన్షన్లు, 17 భాషల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోటి సీడ్ బాల్స్ తయారు చేయడమే లక్ష్యం


సీడ్ బాల్స్ అందజేస్తున్న రవిచంద్రన్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఒక కోటి సీడ్ బాల్స్ (విత్తన బంతులు) చేయాలనే లక్ష్యంతో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ పనిచేస్తోందని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం ఫారెస్ట్ కార్యాలయంలో సుమారు 2.50 లక్షల సీడ్ బాల్స్ అందించారు. ఆయన మాట్లాడుతూ ఒక కోటి సీడ్ బాల్స్ చేసినందుకు ఎలైట్ వరల్డ్ రికార్డు వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్‌కు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఐఈసీ ఆఫీసర్లు మానేపల్లి రమేష్, గవర్నర్ ప్రవీణ్ కుమార్, శిఘాకొల్లి కరుణ కుమార్, బోడా సాయి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

వాతావరణం.. గందరగోళం

కడియం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గందరగోళంగా మారాయి. ఉదయమే ఎండ కాస్తోంది, గంటలో వాన పడుతుంది. వర్షం తగ్గినే వెంటనే మళ్లీ ఎండ విజృంభిస్తోంది. పగటిపూట అధికంగా, రాత్రిపూట తక్కువగా ఉష్ణోగ్రతలు ఉండడంతో పంటలపై తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. మండలంలోని వీరవరం, మురమండ, కడియపులంక, దుళ్ల, మాధవరాయుడుపాలెం తదితర గ్రామాల్లో శుక్రవారం ఎండ తీవ్రత కనిపించింది. అంతలోనే కారు మబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. వరిచేలు చిరుపొట్ట దశ, గింజలు పాలుపోసుకునే దశల్లో ఉన్నాయని, ఇప్పుడు వర్షాలు కురిస్తే దిగుబడులపై ప్రభావం పడుతుందని ఆయా గ్రామాల్లోని రైతులు చెబుతున్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు


నటరాజ్ థియేటర్ వద్ద గల రైతు బజార్‌లో స్టాల్‌ను ప్రారంభించి ఆయిల్ ప్యాకెట్ అందజేస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జేసీ చిన్నరాముడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నిత్యావసర వస్తువులు ధరలను నియంత్రించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నటరాజ్ థియేటర్ రైతుబజార్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి శుక్రవారం సాయంత్రం పామాయిల్, కందిపప్పు విక్రయ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటేశ్వర హోల్‌సేల్ మార్కెట్, నటరాజ్ థియేటర్ రైతు బజార్‌లో తక్కువ ధరకే పామాయిల్, కందిపప్పును అందిస్తున్నామన్నారు. జేసీ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ రైతు బజార్లు, పెద్ద సంస్థాగత, రిటైల్ దుకాణాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉండేలా కేజీ పామాయిల్‌ను రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.124, కందిపప్పు (దేశవాళి)ను రూ.150, స్టీమ్ బీపీటీ సోనామసూరి బియ్యాన్ని రూ.48, పచ్చి బీపీటీ సోనామసూరి బియ్యాన్ని రూ.47కు విక్రయాలు చేస్తున్నామన్నారు. ఎస్‌వీజీ మార్కెట్‌లో స్టాల్‌ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో కృష్ణ నాయక్, డీఎస్‌వో ప్రసాదరావు, జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్, ఎంఎస్‌వోలు నాగలక్ష్మి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యాయామం చాలా అవసరం

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బొమ్మూరు నేతాజీ నగర్‌లో జిల్లా పవర్‌లిఫ్ట్ అసోషియేషన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జిమ్‌లలో ఏర్పాటు చేసిన నూతన వ్యాయామ పరికరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు మండల పరిషత్ నిధులు రూ.లక్షతో నూతన పవర్ లిఫ్టింగ్ పరికరాలను అందిచామన్నారు.

అన్న సమారాధన

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ బుచ్చియ్య నగర్‌లోని డాబా కొట్టు సెంటర్‌లో గల కనకదుర్గ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు రెండువేల మంది తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ ఆలయంలో ఏర్పాటు చేసిన పీఠంలో 53 మంది భవానీ దీక్ష చేపట్టారు.

రేపు రతన్ టాటా సంస్మరణ సభ

రాజమహేంద్రవరం రూరల్: వ్యాపారవేత్త, పద్మవిభూషణ్ రతన్ టాటా మరణం అందరికీ తీరని లోటని సత్య చారిటబుల్ ట్రస్టు సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 9 గంటలకు మోరంపూడి శుభమస్తు ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న టీ టైమ్ వద్ద రతన్ టాటా సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు.